అభివృద్ధి పనులు పూర్తి చేసేలా చర్యలు



కూన శ్రీశైలంగౌడ్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ సంజయ్ పురి కాలనీలో వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో అండర్ డ్రైనేజీ లైన్ వేసే క్రమంలో రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగడంతో ఈ విషయాన్ని కూన శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన మంత్రి శ్రీధర్‌బాబు, జోనల్ కమిషనర్‌ల దృష్టికి తీసుకువెళ్లి రూ.72 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆదివారం ఆయన సంజయ్‌పురి కాలనీని సందర్శించి రోడ్డును పరిశీలించగా.. బస్తీ వాసులు శ్రీశైలంగౌడ్‌ను సత్కరించి రోడ్డు సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓరుగంటి కృష్ణగౌడ్, రషీద్, దామోదర్‌రావు, వెంకటేశ్వర రావు, సత్యగుప్తా, ఇస్మాయిల్, భాగ్యలక్ష్మి, గౌస్, లక్ష్మీనరసింహులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు శ్రీశైలంగౌడ్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. తమ కాలనీల్లో వీధి దీపాలు, డ్రైనేజీ, తాగునీటి లైన్లు, రోడ్లను ఏర్పాటు చేయాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు.



శ్రీశైలంగౌడ్‌కు సమస్యలు వివరిస్తున్న ఆయా కాలనీల ప్రజలు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలి



టీయూడబ్ల్యూజేలో చేరిన వారికి సభ్యత్వాలు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు బాలరాజు

కుత్బుల్లాపూర్: అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలను కేటాయించాలని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు బాలరాజు ప్రభుత్వాన్ని కోరారు. సూరారంలోని కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్‌లో టీయూడబ్ల్యూజే-143కి చెందిన పలువురు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఆదివారం టీయూడబ్ల్యూజేలో(ఐజేయూ) చేరారు. యూనియన్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కోటగడ్డ శ్రీనివాస్, సాయిబాబాలతో కలిసి ఆయన సభ్యత్వాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సంక్షేమానికి మంచి రోజులు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో చేపడుతున్న జర్నలిస్టుల వివరాల సేకరణకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కోశాధికారి శేషారెడ్డి, యూనియన్ జిల్లా నాయకులు సూర్యనారాయణరెడ్డి, నాగేంద్ర చారి, రాజు, లక్ష్మణ్, మల్లేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం



ఎంపీ రాజేందర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

సుభాష్‌నగర్: యోగాతో పరిపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ యోగాసనాలు నేర్చుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లో శివశక్తి ధ్యాన యోగా ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు బిజీ ప్రపంచంలో అనేక మంది శారీరక, మానసిక రుగ్మతలతో బాధ పడుతున్నారని, వారికి యోగా ఓ చక్కని పరిష్కారాన్ని చూపుతుందన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, జితేందర్ రెడ్డి, వాసు శ్రీనివాస్, శేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ టౌన్ ప్లానింగ్ సేవలు!

- నిజాంపేట్ మున్సిపల్‌లో ఐదారు నెలలుగా ఖాళీగానే ఏసీపీ పోస్టు
- మరోవైపు ఇన్‌చార్జి టీపీఎస్ అధికారి
- అదనపు బాధ్యతలతో అంతంత మాత్రంగానే సేవలు
- ఇబ్బందుల్లో ప్రజలు.. పట్టని అధికారులు



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో టౌన్ ప్లానింగ్ విభాగం ఉందా..? లేదా..? అనే పరిస్థితులు నెలకొన్నాయి. ఇందులోని ఏసీపీ పోస్టు ఐదారు నెలలుగా ఖాళీగానే ఉన్నది. దీనికితోడూ జనగామ మున్సిపాలిటీలో టీపీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రశాంతికి ప్రభుత్వం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ టీపీఎస్ ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. దీంతో ఆమెకు రెండు ప్రాంతాల్లో విధులు ఉండడంతో పూర్తిస్థాయిలో ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రశాంతి నెల రోజుల పాటు సెలవులో ఉండడంతో సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి పూర్తి స్థాయిలో అధికారి లేకపోవడంతో అటు అధికారులకు, ఇటు కిందిస్థాయి సిబ్బందికి సైతం అవస్థలు తప్పడం లేదు.

జనగామకే అధిక సేవలు.. నిజాంపేట్‌కు తక్కువ..

ఏడాదిన్నరగా నిజాంపేట్ ఇన్‌చార్జిగా టీపీఎస్‌గా ప్రశాంతి విధులు నిర్వర్తిస్తుంది. మొదట్లో వారానికి మూడు రోజులు జనగామ, మరో మూడు రోజులు నిజాంపేట్‌లో విధులు నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం జనగామకే ఎక్కువ పరిమితమై, నిజాంపేట్‌కు వారానికి కేవలం ఒక్క రోజే వస్తున్నారని పలువురు బాధితులు వాపోతున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ అధికారి ఉన్నప్పుడు టీపీఎస్ లేకపోయిన తమ పనులు , గత ఆరు నెలల నుంచి సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేసుకున్న వారి పని ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన, ఫిర్యాదుల పరిష్కారం, ఎన్‌ఓసీల జారీతో పాటు ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం లాంటి అనేక సమస్యలు ఉన్నాయి. అయితే పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేసే అధికారి లేకపోవడంతో సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయని పలువురు వాపోతున్నారు.

ఆఫీస్‌లో ఉండరు.. ఫోన్ లిఫ్ట్ చేయరు..

రెండు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న టీపీఎస్ ప్రశాంతి ఎప్పుడూ ఆఫీసులో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొన్నది. కనీసం కాల్ చేసి తెలుసుకుందామంటే ఫోన్ ఎత్తడం లేదని, కింది స్థాయి సిబ్బందిని అడిగితే వారికి పూర్తి స్థాయిలో సమాచారం ఉండదని బాధితులు వాపోతున్నారు.

ఎక్కడ చూసినా ఫుట్ పాత్‌ల ఆక్రమణే..

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జనాభాతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రధాన రోడ్ల వెంట ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్‌లో ఎక్కడ చూసినా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు పెరిగిపోయాయి. వీటిని నియంత్రించాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం పూర్తిగా విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్ల వెంట ఉండే చిరు వ్యాపారులకు ప్రభుత్వ స్థలాల్లో వ్యాపారాలు చేసుకునేందుకు సదుపాయాలు కల్పిస్తామని అధికారులు హామీనిచ్చారు. కానీ ఇప్పటి వరకు అది అమలుకు నోచుకోలేదు.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు..



హెచ్ఎండీఏ నిర్మాణాలపై పూర్తిస్థాయిలో మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. అనుమతుల మంజూరులో వారి పాత్ర కీలకం. పలు ఆక్రమణాలపై తాము ఫిర్యాదు చేస్తే టీపీఎస్ ప్రశాంతి స్పందించడం లేదు. పైగా హెచ్ఎండీఏ అనుమతులు ఉన్నాయని చెప్పడం ఎంతవరకు సమంజసం.అంబీరు చెరువులో చిరు వ్యాపారులను తొలగించారు. వారికి ప్రత్యామ్నాయం కల్పిస్తామన్నారు. కొత్తగా వచ్చిన కమిషనర్ టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ఇకనైనా గాడిన పెడతారని ఆశిస్తున్నాం.

–సుధీర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ప్రగతినగర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



నిజాంపేట్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ భర్తీ విషయమై ఇప్పటికే డైరెక్టర్ టౌన్ ప్లానింగ్‌కు లెటర్ పెట్టాం. అదేవిధంగా సీడీఎంఏకు సైతం కాపీ పంపించాము. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి టీపీఎస్ ప్రశాంతి నెల రోజుల పాటు సెలవులో ఉన్నారు. ప్రజలకు ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి వస్తే పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటాను.

–సౌజన్య, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

శభాష్.. సీనియర్ సిటిజన్స్

- పార్కుల అభివృద్ధికి తోడ్పాటు
- సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి



పార్కులో శ్రమదానంతో చెత్త, చెదారాన్ని తొలగిస్తున్న సీనియర్ సిటిజన్స్

నిజాంపేట్: హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న ప్రగతినగర్‌కు రాష్ట్రంలోనే ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆదర్శ గ్రామంగా అందరికీ సుపరిచితమే. ఇక్కడ నివసిస్తున్న సీనియర్ సిటిజన్స్ సైతం తాము చేపడుతున్న కార్యక్రమాలతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. 'మోసేది బరువనుకుంటే దింపేయాలనిపిస్తుంది.. బాధ్యత అనుకుంటే మోయాలనిపిస్తుంది' సరిగ్గా ఇక్కడ సీనియర్ సిటిజన్స్ ఇదే చేస్తున్నారు. సామాజిక అంశాలు, సేవలు చేయడాన్ని బాధ్యతగా భావిస్తున్నారు. అందుకే రిటైర్‌మెంట్ తరువాత విశ్రాంతి తీసుకోవాల్సిన వయస్సులో కాలనీ అభివృద్ధి కోసం , పార్కుల అభివృద్ధి కోసం ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు అందజేస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్‌లోని ప్రగతి సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు ప్రతి రోజు వాకింగ్‌లో కలుసుకుని తమ చుట్టూ ఉన్న సమస్యల పట్ల స్పందిస్తారు. వాటి పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. సామాజిక అంశాలపై సైతం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో వాసవీ లేఅవుట్‌లోని సీనియర్ సిటిజన్స్‌ను పలువురు అభినందిస్తున్నారు. కాలనీలో డ్రైనేజీ, రోడ్లు, మొక్కలు, పార్కులు ఇలా ఏ సమస్య వచ్చినా వెంటనే ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చొరవ తీసుకుంటున్నారు.

ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా...

ప్లాస్టిక్ కవర్‌లు, వస్తువులు మానవాళికి ప్రమాదకరమని సీనియర్ సిటిజన్స్ అవగాహన కల్పిస్తున్నారు. సామాజిక బాధ్యతగా పార్కుల్లో ఉన్న ప్లాస్టిక్ కవర్‌లను తొలగిస్తున్నారు. అదేవిధంగా సమాజంలో నెలకొన్న వివిధ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైతం తమ వంతు కృషి చేస్తున్నారు. ఇటీవల కోల్‌కతాలో ఓ వైద్యురాలిపై జరిగిన సంఘటనకు నిరసనగా ర్యాలీలు చేపట్టి మహిళల పట్ల జరుగుతున్న దాడులను సైతం ఖండించారు.



మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ (ఫైల్)

నేటి నుంచి వైద్య శిబిరాలు

కుత్బుల్లాపూర్: కూకట్‌పల్లి జోనల్ పరిధిలోని పనిచేసే స్వీపర్లు, ఎంటమాలజీ కార్మికులకు సోమవారం నుంచి సర్కిళ్ల వారీగా ఉచిత వైద్య శిబిరంతో పాటు పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోషకాహారం, పారిశుద్ధ్యం, వ్యాధుల నివారణతో పాటు మహిళా కార్మికులకు పరీక్షలు చేసేందుకు నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉంచారు.

1అక్టోబరు 3వ తేదీన కుత్బుల్లాపూర్ సర్కిల్ మాణిక్యనగర్ కమిటీ హాల్‌లో, 4న గోదావరి హోమ్స్ టీఎస్ఆర్ గార్డెన్స్‌లో 350 మంది కార్మికులకు, 7న గాజులరామారం సర్కిల్ భగత్‌సింగ్ కమిటీ హాల్‌లో, 8న ఆదర్శనగర్ కమ్యూనిటీ హాల్‌లో 375 మంది కార్మికులకు పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాలకు ఆయా శాఖల అధికారులు హాజరై విజయవంతం చేయాలని జోనల్ కమిషనర్ కోరారు.

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా సరితారావు



కుత్బుల్లాపూర్: బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొంపల్లి మున్సిపాలిటీకి చెందిన సరితారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పాం మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సరితారావు గతంలో మేడ్చల్ రూరల్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. మహిళా మోర్చా, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలను సంఘటితం చేసి బీజేపీ మెజారిటీ సాధించడంలో కీలకంగా వ్యవహరించారు.

ప్రగతినగర్ లేక్‌వ్యూ కాలనీలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న యశోద హాస్పిటల్ వైద్య సిబ్బంది

నిజాంపేట్: వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని యశోద హాస్పిటల్ సౌజన్యంతో అంబీర్ లేక్ వాకర్స్ అసోసియేషన్, లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రగతి నగర్ లేక్‌వ్యూ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, డెంటల్, ఆప్తమాలజీ, పెడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిన శిబిరంలో పెద్ద సంఖ్యలో స్థానికులు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌కుమార్, అంబీర్ లేక్ వాకర్స్ అసోసియేషన్ వాలంటీర్స్ సాంబశివరావు, శాస్త్రి, గోపాలకృష్ణరాజు, నరసింహరాజు, విజయ్‌సింహ, చక్రధర్ రావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'చలో లేబర్ కమిషనర్'



నిజాంపేట్: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కరించాలని సోమవారం చలో లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం కాంట్రాక్ట్ వర్కర్స్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్, బాచుపల్లి ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధ్యక్షుడు వెంకటరాజం, నారాయణ, చెన్నయ్య, వెంకన్న, మద్దిలేటి నరసింహ, శ్రీను, మణి, లక్ష్మి, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీయూడబ్ల్యూజే-143 నియోజకవర్గ స్థాయి సమావేశం

కుత్బుల్లాపూర్: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం (టీయూడబ్ల్యూజే-143) కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు సుధీర్ మంకాల, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, టీఈఎంజేయూ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11:30 గంటలకు సూరారంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో జరిగే సమావేశంలో దుండిగల్ ప్రాంతంలోని స్థలంలో జర్నలిస్టులకు కేటాయించే ఇళ్ల స్థలాల అంశంతో పాటు, అక్రిడిటేషన్‌లు, హెల్త్ కార్డులపై చర్చించనున్నట్లు తెలిపారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం ఎంతో అత్యంత వైభవంగా జరిగే బతుకమ్మ వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. సోమవారం మొదటి బతుకమ్మ, బుధవారం పెద్దల అమావాస్య, 8వ తేదీన అట్ల బతుకమ్మ, 9వ తేదీన విజయదశమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. విజయదశమి రోజు కూకట్‌పల్లి రామాలయం వద్ద సాయంత్రం 5:30 గంటలకు జమ్మి పూజ, రంగధాముని చెరువు వద్ద విద్యుత్ కాంతుల వెలుగులతో బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

శివారు రహదారులు..నరకానికి నకళ్లు!



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు పట్టణాల్లో అధికార యంత్రాంగం పన్నుల వసూళ్లు, అక్రమ లావాదేవీలపై ఉన్న శ్రద్ధను అభివృద్ధి కార్యక్రమాలపై చూపకపోవటంతో పట్టణ ప్రజలు పలు సమస్యలతో తల్లడిల్లుతున్నారు. ఇటీవల శివారుల్లోని 11 పురపాలికల్లో విలీనమైన 40 పంచాయతీల్లో పేరుకపోయిన చెత్తాచెదారం, అధ్వాన స్థితికి చేరిన డ్రైనేజీలు, గుంతల రోడ్ల సమస్యలతో పట్టణాల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. విలీనమైన 40 పంచాయతీలకు మున్సిపల్ శాఖకు చెందిన జిల్లా స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా తయారైంది. చిన్న పాటి వర్ష పడితే చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారుతుండగా, పట్టణాలు నరకానికి నకళ్లుగా దర్శమిస్తున్నాయి. ఇటీవల ఎడతెరిపి లేకుండా రోజూ కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాలు, మురికి వాడలు వరదమయంగా మారుతుండగా, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా నడవలేని స్థితికి చేరుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- శివారుల్లో అతిపెద్ద నగర పాలక సంస్థ బోడుప్పల్‌లో రూ. 1.50 లక్షల జనాభాతో 162 కాలనీలు ఉండగా, వివిధ పన్నుల ద్వారా యేటా రూ. 60 కోట్లకు పైగా ఆదాయం సమకూరుతోంది. అయినా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, కాలుష్యం, చెరువు నీటి దుర్వాసన, పైప్‌లైన్ల లీకేజీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- మరో మున్సిపల్ కార్పొరేషన్ పీర్జాదిగూడ కూడా లక్షకు పైగా జనాభాతో 80 కాలనీలను కలిగి ఉండగా, యేటా పన్నుల ద్వారా రూ. 40 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. అయినా ప్రజలు మాత్రం పలు సమస్యలతో బాధపడుతున్నారు. సమస్యలు వీటికే పరిమితం కాలేదు. ఇలాంటి అధ్వాన పరిస్థితులు ఉన్న పట్టణాలు నగర శివారు పరిధిలో పలు నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు ఉన్నాయి.
- ఇటీవల శివారుల్లోని 40 గ్రామ పంచాయతీలను కూడా ఏడు పురపాలక సంఘాల్లో ప్రభుత్వం విలీనం చేసింది. ఇక్కడా బోలెడు సమస్యలు దర్శనమిస్తున్నాయి.

రూ. కోట్లల్లో పన్నులు వసూలైనా..

మేడ్చల్ జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 190 కోట్లు వస్తుండగా, రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాల నుంచి రూ. 175 కోట్లు వసూలవుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ. 3 నుంచి రూ. 21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి.

- వీటిని ప్రణాళికాబద్ధంగా పనులకు వెచ్చించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టక పోవటంతో అభివృద్ధి రెండు అడుగులు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి అనే చందంగా తయారైంది.

శివారుల్లో పట్టణాలివే...

నగర శివారుల్లో బోడుప్పల్, ఫీర్జాదిగూడ నిజాంపేట్, జవహర్‌నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ నగర పాలక సంస్థలు కాగా, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, పెద్ద అంబర్‌పేట్, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, తుర్కయాంజాల్, మణికొండ, నార్సింగ్, ఆదిభట్ల, ఆమనగల్లు మున్సిపాలిటీలుగా కొనసాగుతున్నాయి.



'మద్దాలకుంట'ను మింగేస్తున్నారు..!

- రాళ్లు, మట్టితో నింపుతున్న వైనం
- విస్తీర్ణం 11.73 ఎకరాలు.. ప్రస్తుతం ఉన్నది 3.2 ఎకరాలే..!
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం మద్దాలకుంట చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. చెరువును రాళ్లు, మట్టితో కబ్జాదారులు కప్పేస్తున్నారు. అక్కడ ప్రహరీ నిర్మాణం జరుగుతున్నా అధికారులు అటువైపు చూడటం లేదు. కోట్ల విలువ చేసే చెరువును కబ్జా చేస్తున్నా అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారుల కనుసన్నల్లోనే కబ్జాదారులు బరితెగిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



కుత్బుల్లాపూర్ : గాజులరామారం సర్వే నెంబర్ 335లో మద్దాలకుంట చెరువు 11.73 ఎకరాల విస్తీర్ణంలో (ఐడీ:2800/ఇన్/15) ఇరిగేషన్ నోటిఫికేషన్ ప్రకారం ఉంది. సుమారు రూ.100 కోట్లకు పైగానే విలువ చేసే ఈ చెరువు కబ్జాకు గురవుతుంది. ఇటీవల మట్టి, పెద్ద పెద్ద రాళ్లు వేసి చెరువును పూడ్చే పనిలో ఉన్నారు కబ్జాదారులు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు కళ్లు మూసు కోవడం విశేషం. చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వాటిని గుర్తించి హైడ్రా అధికారులు కూల్చివేతల పర్వం కొనసాగిస్తుంటే గాజులరామారం లో మాత్రం కబ్జాదారులు చెరువును మాయం చేసే పనిలో ఉన్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ, హైదరాబాద్ నార్త్ ట్యాంక్ ఇరిగేషన్ అధికారులు కట్టడి చేయాల్సి ఉండగా.. అది తమ పరిధి కాదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఒకవైపు చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం , హైడ్రా కూల్చివేతలు చేస్తూ కేసులు పెడుతున్న కబ్జాదారులు భయపడక పోవడం విశేషం. కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి అక్కడ జరుగుతున్న చెరువు పూడ్చివేత పనులను అడ్డుకొని మద్దాల కుంట చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

మిగిలింది 3.2 ఎకరాలే.. !

సర్వే నెంబర్ 335లో ఇరిగేషన్ శాఖ అధికారులు చెప్పిన ప్రకారం 11.73 ఎకరాల్లో ఉంది. ధరణి రికార్డులో మాత్రం కేవలం చెరువు ప్రాంతం 3.2 ఎకరాలు మాత్రమే చూపించడం విశేషం. మిగిలిన 8.71 ఎకరాల స్థలం ఎటు పోయింది.. కబ్జాదారులు చెరువు స్థలాన్ని బై నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించి స్థలాన్ని మాయం చేసినట్లు తెలుస్తోంది. అంతేగాకుండా కుత్బుల్లాపూర్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇదే సర్వే నెంబర్లు 20 ఎకరాల స్థలం ప్రొవిడేట్ స్థలంగా (ప్రభుత్వ స్థలం)చూపిస్తుండటం విశేషం. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి 100 కోట్ల విలువ చేసే ఈ చెరువును కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పరిశీలన చేసి నిలిపేస్తాం

మద్దాలకుంట చెరువు స్థలాన్ని పరిశీలించి, అక్కడ జరిగే పనులను నిలిపివేస్తాం. ఇరిగేషన్ అధికారులకు కూడా సమాచారం ఇస్తాం. ఎవరైనా చెరువు స్థలంలో కట్టడాలు నిర్మిస్తే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం.

– అబ్దుల్ రెహమాన్‌ఖాన్, తహసీల్దార్